
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 18 । జూన్ । 2023



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 1,590, మధ్య డెల్టాకు 1,140, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



నిత్యాన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి పిన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి (నల్గొండ జిల్లా) శనివారం రూ.1,01,116 విరాళం సమర్పించినట్లు డీఈఈ గుర్రాజు తెలిపారు.

గరిష్టం/కనిష్టం 44.0° / 28.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	44.0	31.0
కాకినాడ	40.3	30.9
అమలాపురం	41.0	28.0

న్యూస్‌రీల్

వాడపల్లి.. భక్తజనఝురి..



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. సుమారు 30 వేల మంది స్వామి వారిని దర్శించుకున్నారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పలు గ్రామాల నుంచి భక్తులు కాలి నడకన వచ్చి మరీ స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారిని నెమలి పింఛాలు, వివిధ రకాల విరి మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాదాల విక్రయం, ఇతర విరాళాల రూపంలో స్వామి వారికి రూ.14,69,881 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

బాలబాలాజీకి రూ.2.11 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారికి వివిధ సేవల ద్వారా శనివారం రూ.2.11 లక్షల ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.61 లక్షలు, నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలుగా రూ.50,608 సమకూరాయి. మొత్తం 3,096 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు, ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేసి, స్వామి వారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. తలనీలాలు సమర్పించారు. మొత్తం 2,471 మంది అన్న ప్రసాదం స్వీకరించారని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ జి.మాధవి తెలిపారు.

కుష్ఠుపై ఇంటింటి సర్వే

వైద్యాధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశం



ఇంటింటి సర్వే వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ శుక్లా తదితరులు

అమలాపురం రూరల్: కుష్ఠు వ్యాధి అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఈ నెల 26 నుంచి జూలై 16 వరకూ ఇంటింటి సర్వే చేపట్టాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా వైద్యాధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. కుష్ఠు వ్యాధిపై ఇంటింటి సర్వేకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్, సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 31 పీహెచ్‌సీల పరిధిలో 37 లెప్రసీ కేసులున్నాయని చెప్పారు. వీరికి అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 21 రోజుల పాటు జరిగే ఇంటింటి సర్వేలో 1,408 మంది ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొంటారన్నారు. ఉదయం 9 లోపు, సాయంత్రం 6 గంటల తర్వాత వెళ్లి పరీక్షలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని 5,86,058 ఇళ్లల్లో ఈ సర్వే జరుగుతుందని చెప్పారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి దుర్గరావుదొర కన్వీనర్, అడిషనల్ డీఎంహెచ్‌వో భరతలక్ష్మి, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ అధికారి భీమేశ్వరరావు, కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జ్యోతిలక్ష్మీదేవి, ఐసీడీఎస్ పీడీ జీవీ సత్యవాణి, డిప్యూటీ పారామెడికల్ అధికారి కేవీ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాన్నా.. థ్యాంక్యూ



అమ్మ ప్రేమతో పోల్చుకుంటే నాన్నెందుకో వెనుకబడ్డాడంటూ ఇటీవల సోషల్ మీడియాలో ఒక పోస్టు బాగా వైరల్ అయ్యింది. బిడ్డకు నాన్న వెన్నెముకగా నిలుస్తాడు. వెన్నెముక శరీరంలో వెనుక భాగంలో ఉంటుంది. అందుకే వెనుకబడ్డాడంటూ నాన్న విశిష్టతను చివరిలో ఒక్క మాటలో చక్కగా ముగించారు ఆ కవితలో. నిజమే.. బిడ్డ ఎదుగుదల వెనుక నాన్నే సర్వస్వం. ఒడిలో కూర్చోబెట్టుకుని ఓనమాలు నేర్పించింది మొదలు.. చేయి పట్టుకుని బుడిబుడి అడుగులు వేయిస్తూ.. తర్వాత ప్రపంచాన్ని పరిచయం చేస్తాడు నాన్న. అందరి జీవితాల్లోనూ నాన్నది ఇదే పాత్ర. బిడ్డ ఎదిగే క్రమంలో ప్రతి అడుగులోనూ తానుంటాడు. లక్ష్యాన్ని ఏర్పరుస్తాడు. దాన్ని సాధించడానికి మార్గమూ చూపిస్తాడు. ఇలా తన జీవితాన్ని కన్న బిడ్డల కోసమే అంకితమిచ్చే నాన్నకు ఏమిచ్చి రుణం తీర్చుకోగలం! గుర్తు చేసుకోవడం తప్ప. నేడు ఫాదర్స్ డే. ఈ సందర్భంగా జిల్లాల్లోని కొందరు ఉన్నతాధికారులు తమ తండ్రుల గురించి ఇలా వివరించారు.

సాక్షి ప్రతినిధి, కాకినాడ/
సాక్షి, అమలాపురం/అమలాపురం టౌన్



నా ప్రతి అడుగులోనూ నాన్నే..



తల్లిదండ్రులతో కలెక్టర్ కృతికా శుక్లా

మాది పంజాబ్ దగ్గర చండీఘర్. నాన్న పేరు మదన్‌లాల్‌బాత్రా. ఆయనకు స్టాక్‌బ్రోకింగ్ కంపెనీ బ్రాంచి ఉండేది. నా కలలు నెరవేర్చడంలో ఆయన ఎప్పుడూ ముందున్నారు. మానవీయ విలువలతో కూడిన సమాజ నిర్మాణం కోసం పని చేయాలని చిన్నప్పటి నుంచీ నూరిపోసేవారు. ఈ ప్రయాణంలో ఎప్పుడూ వెనకడుగు వేయవద్దని చెప్పేవారు. నాడు ఆయన చెప్పిన మాటలు ఇప్పటికీ నా చెవుల్లో వినిపిస్తూనే ఉంటాయి. నా జీవితంలో ఆయన ఒక మార్గదర్శిగా నిలిచారు. ఇప్పటికీ ఏ చిన్న అవసరం వచ్చినా ఆయన సూచనలు, సలహాలు తీసుకుంటాను. ప్రాథమిక విద్య నుంచి ఐఏఎస్‌కు ఎంపికయ్యే వరకూ నా ప్రతి అడుగులోనూ నాన్న ఉన్నారు. ఏ పని చేసినా సమాజ ఉన్నతి కోసమనే లక్ష్యం కచ్చితంగా ఉండాలని చెప్పేవారు. ఆయన మాటలను తు.చ. తప్పకుండా పాటిస్తూనే ఉంటాను.

– డాక్టర్ కృతికా శుక్లా, కలెక్టర్, కాకినాడ

నాన్న మాట.. బంగారు బాట



మా నాన్న నాకు గురువు, మార్గదర్శకులు. మాది కాన్పూర్. నాన్న ఎంఎల్ శుక్లా వ్యవసాయ శాఖలో డీడీగా పని చేసి రిటైరయ్యారు. చిన్నప్పటి నుంచీ ఆయన చెప్పే ప్రతి మాట ఎప్పటికీ మరచిపోను. ఎదిగే క్రమంలో నాన్న అడుగుజాడల్లోనే నడుచుకున్నాను. జీవితాంతం ఆయన సూచనలు పాటించాలని చిన్నప్పుడే కఠిన నిర్ణయం తీసుకున్నాను. గెలుపు, ఓటమి ఏదైనా నా వెనుక ఆయన ఎప్పుడూ ఉన్నారు. ఇప్పటికీ ఉంటున్నారు. ఓటమి అనేది తాత్కాలికం. దానికి కుంగిపోకూడదని ఎప్పుడూ చెబుతుంటారు. అదే భవిష్యత్‌లో గెలుపునకు దిక్సూచి కావాలని ఎప్పుడూ ధైర్యం నూరిపోస్తుంటారు. ఆయన ప్రతి మాటను గుర్తుకు తెచ్చుకుని పనిలో ముందుకు సాగుతాను. చిన్నప్పటి నుంచీ లక్ష్యం ఏర్పరుచుకోవాలన్నారు. ఐఏఎస్‌కు ఎంపిక కావడం వెనుక ఆయన మాటలే స్ఫూర్తిమంత్రంగా పని చేశాయి.

– హిమాన్షు శుక్లా, కలెక్టర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

నాన్నే నా గురువు



నాన్నే నా గురువు. నేను సివిల్స్ చేయాలనే లక్ష్యాన్ని నా ఐదో తరగతిలోనే నిర్దేశించారు. అది సాధిస్తానని నాకన్నా ఆయనే ప్రగాఢంగా విశ్వసించారు. సాధించినప్పుడు నాకన్నా నాన్నే అధికంగా సంతోషించారు. మాది కర్ణాటకలోని షిమోగా. తాతగారి కుటుంబంలో 9 మంది పిల్లలున్నా నాన్న హాలేషప్ప, పెదనాన్న మాత్రమే ఉన్నత విద్య అభ్యసించారు. నాన్న కర్ణాటక గృహ నిర్మాణ శాఖలో సివిల్ ఇంజినీర్. అమ్మ మమత ఉపాధ్యాయురాలు. వీరిద్దరి ప్రభావం నా మీద ఉంది. పల్లెటూరిలో పెరిగిన నాన్నకు గ్రామంలో ఏ సమస్య వచ్చినా ఉన్నతాధికారుల వద్దకు వెళ్లాల్సి వచ్చేది. ప్రజల సమస్యలు తీర్చాలంటే పిల్లలు ఉన్నతోద్యోగాలు చేయాలని ఆయన ఆశించారు. నన్ను జిల్లా కలెక్టర్ (కర్ణాటకలో డిప్యూటీ కమిషనర్) అవ్వాలనేవారు. అందుకు తగినట్టుగానే నన్ను తీర్చిదిద్దారు. సబ్జెక్టులు చదివించడం, ప్రపంచ జ్ఞానాన్ని బోధించడం, కరెంట్ ఎఫైర్స్‌పై చర్చించడం, పాజిటివ్ విషయాలు చెప్పడం.. ఇలా అన్ని విషయాల్లోనూ నాన్న వెన్నెముకగా నిలిచారు. నేను సివిల్స్ సాధిస్తాననే ధైర్యాన్నిచ్చారు. కర్ణాటక పంచాయతీరాజ్ విభాగంలో నేను ఇంజినీర్‌గా ఎంపికవడం, అక్కడి ప్రభుత్వం నిర్వహించే సీటీఓలో (మన రాష్ట్రంలో ఏపీపీఎస్సీ) స్థానం సంపాదించడం, చివరకు సివిల్స్‌కు ఎంపికవడం ఒకే రోజు జరిగాయి. మా నాన్న 47వ ఏట నేను సివిల్స్ సాధించి, ఆయన కోరిక నెరవేర్చాను. ఆయన ఇప్పటికీ సర్వీసులోనే ఉన్నారు. గ్రామీణ ప్రజలు, రైతులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపమని ఉద్యోగంలో చేరేటప్పుడు నానన్న చెప్పారు. ఆయన కోరికకు తగినట్టుగానే నేను పని చేస్తున్నాను.

– ధ్యానచంద్ర హెచ్ఎం, జాయింట్ కలెక్టర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

కష్టార్జితంతో నన్నింత వాడిని చేశారు



మాది శ్రీకాకుళం జిల్లా పలాస. ఊరికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని టూరింగ్ సినిమా థియేటర్‌లో మా నాన్న రామకృష్ణారావు బుకింగ్ క్లర్క్‌గా పని చేసేవారు. ఆ కష్టార్జితంతోనే మా కుటుంబాన్ని పోషించారు. తన రెక్కల కష్టంతో నన్ను చదివించి, ఇంతటి వాడిని చేశారు. ఉదయం క్యారేజీ కట్టుకుని థియేటర్‌కు కాలి నడకన వెళ్లి, అక్కడే భోజనం చేసి సెకండ్ షో అనంతరం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటికి చేరేవారు. తన కష్టార్జితంతోనే తన సోదరి వివాహం చేసి, ఆమెను ఓ ఇంటిదాన్ని చేశారు. మా అమ్మ, నాన్న, నేను ఇప్పుడు ఒకేచోట ఉంటున్నాం. నాన్నను జీవితంలో ఎప్పుడూ విడిచి ఉండలేదు. నేను గ్రూప్–1 ఆఫీసర్‌గా ట్రైనింగ్‌లో ఉన్నప్పుడు కూడా నాతో తీసుకుని వెళ్లాను. ఇక్కడకు ఎస్పీగా వచ్చాక అమ్మానాన్నలను తీసుకువచ్చి, నాతోనే ఉంచుకుంటున్నాను. కష్టం, ఓర్పు వంటివి నాన్న జీవితాన్ని చూసే అలవాటు చేసుకున్నాను. అందువల్లనే తొలుత గ్రూప్–1 అధికారిగా డీఎస్పీగా.. తర్వాత ఐపీఎస్‌గా ఎదిగాను.

– సుసరాపు శ్రీధర్, ఎస్పీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

చదువుతోనే సామాజిక వికాసం

- అందుకే సీఎం జగన్ విద్యకు పెద్ద పీట వేశారు
- జిల్లా స్థాయి జగనన్న ఆణిముత్యాల సభలో మంత్రి విశ్వరూప్



జిల్లా స్థాయి టాపర్లకు నమూనా చెక్ అందిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్, కలెక్టర్ శుక్లా

అమలాపురం టౌన్: చదువుతో వ్యక్తిగత వికాసంతో పాటు సామాజిక వికాసం కూడా సాకారమవుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో జిల్లా స్థాయి టాపర్లుగా నిలిచిన 20 మంది విద్యార్థులకు 'జగనన్న ఆణిముత్యాలు' పేరుతో స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శనివారం రూ.8.25 లక్షల మేర పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ మేరకు నమూనా చెక్‌ను విద్యార్థులకు అందించారు. వారి తల్లిదండ్రులను, చదువులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ, ఏ వ్యక్తి అయినా చదువుకోవడం ద్వారా విజ్ఞానపరంగా ఎదగడమే కాకుండా సమాజ ప్రగతిలో భాగస్వామి అవుతాడని అన్నారు. మనిషికి చదువే అసలైన ఆస్తి అని భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రంగానికి పెద్ద పీట వేసి, ఇన్ని పథకాలు అమలు చేస్తున్నారని, ప్రోత్సాహకాలు అందిస్తున్నారని చెప్పారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ, ప్రణాళిక ప్రకారం శ్రమిస్తే సాధ్యం కానిది ఏదీ లేదని అన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మిగిలిన వారు ఆదర్శంగా తీసుకుని, చదువులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అభిలషించారు. ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ, నేటి ఆణిముత్యాలైన విద్యార్థులే ముఖ్యమంత్రి జగన్ ఆశించిన విద్యా ప్రగతిని అందిపుచ్చుకునే విద్యావేత్తలై సమాజాభివృద్ధిలో మేము సైతం అంటారని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా విద్యా శాఖాధికారి (డీఈఓ) ఎం.కమలకుమారి మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా పదో తరగతి నుంచి 13 మంది, ఇంటర్మీడియెట్ నుంచి ఏడుగురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో 'జగనన్న ఆణిముత్యాలు'గా నిలిచి, నగదు బహుమతులు, పతకాలు, సత్కారాలు అందుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి మునికుమారి, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామగోపాల్, గెడ్డం సంపదరావు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, వైఎస్సార్ సీపీ అమలాపురం పట్టణం, రూరల్ మండల అధ్యక్షులు సంసాని బులినాని, బొంతు గోవిందశెట్టి, జిల్లా విద్యా శాఖ సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంఓ పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 32 మంది ఎంపిక

అమలాపురం రూరల్: కలెక్టర్ హిమాన్షు శుక్లా, వికాస ఆధ్వర్యాన కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 32 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి ఆఫర్ లెటర్లను జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) సీహెచ్ సత్తిబాబు అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వికాస సేవలు అభినందనీయమని, మరింత మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులు కష్టపడి పని చేసి, మరింత అత్యున్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ మేళాకు మొత్తం 95 మంది హాజరయ్యారని వికాస జిల్లా మేనేజర్ గోళ్ళ రమేష్ తెలిపారు. వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు మాట్లాడుతూ, తమ సేవలను జిల్లాలోని నిరుద్యోగులు వినియోగించుకోవాలని, మరిన్ని ప్రముఖ కంపెనీలతో మాట్లాడి, జాబ్‌మేళాలు నిర్వహించే ప్రయత్నం జరుగుతోందని చెప్పారు.



ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్లు అందజేస్తున్న డీఆర్ఓ సత్తిబాబు

సాక్షి మీడియా గ్రూప్, ఆర్.సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై 24న ఉచిత అవగాహన సదస్సు

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దాదాపు 1000 వరకు గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో.. గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation.com) రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సీ ఎగ్జామ్స్ కలిసి ఈ నెల 24వ తేదీ (శనివారం) ఉదయం 09:00 నుంచి 12:30 వరకు కాకినాడ కల్పన సెంటర్ సమీపాన దంటు కళాక్షేత్రంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం అందరికీ తెల్సిందే.

లెజండరీ ఫ్యాకల్టీతో..

అవగాహన సదస్సుకు రాష్ట్రంలోనే లెజండరీ ఫ్యాకల్టీలైన బి.కృష్ణారెడ్డి (పాలిటీ), అబ్దుల్ కరీం (హిస్టరీ), సి.హరికృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ), ఎండీ పాషా (ఎకానమీ), ప్రొ. చింతా గణేష్ (సోషియాలజీ), మట్టపల్లి రాఘవేంద్ర (కరెంట్ అఫైర్స్), శంకర్ రెడ్డి (మెంటల్ ఎబిలిటీ), జల్లు సద్గుణరావు (జాగ్రఫీ) లాంటి లెజండరీ ఫ్యాకల్టీలు హాజరుకానున్నారు. అవగాహన సదస్సుతో పాటు.. అదే రోజు టాలెంట్ టెస్ట్ నిర్వహించి జిల్లాలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నారు. త్వరలోనే వెయ్యికి పైగా గ్రూప్ 2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రానుండటం.. దీనికి తోడు గ్రూప్–2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 89850 94499 నంబర్‌కు తమ పేరు, ఫోన్ నంబర్, జిల్లా వివరాలను వాట్సాప్‌లో పంపాలి.

SAKSHI MEDIA GROUP
www.sakshi.com

అవగాహన సదస్సు తేదీ : ఈ నెల 24 (శనివారం)

వేదిక : దంటు కళాక్షేత్రం.. మున్సిపల్ ఆఫీస్ వెనుక, కల్పన సెంటర్, కాకినాడ

సమయం : ఉదయం 09 : 00 నుంచి 12 : 30 వరకు

శతాధిక వృద్ధురాలి మృతి

ఆత్రేయపురం: కట్టుంగ గ్రామంలో శతాధిక వృద్ధురాలు గెడ్డం బుల్లెమ్మ (106) శనివారం వృద్ధాప్యంతో మృతి చెందింది. ఆమెకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మనుమలు, మునిమనుమలు 22 మంది ఉన్నారు. ఆమె మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.



గెడ్డం బుల్లెమ్మ (పాత చిత్రం)

యువకుడి దారుణ హత్య

- నిద్ర పోతూండగా పదునైన ఆయుధాలతో దాడి
- పాత కక్షలే కారణమని అనుమానాలు


షేక్ హఫీజ్ (పాత చిత్రం)

నిడదవోలు రూరల్: నిద్ర పోతున్న ఓ యువకుడిపై గుర్తు తెలియని దుండగులు పదునైన ఆయుధాలతో దాడి చేసి, హత మార్చిన ఘటన నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. సమిశ్రగూడెం గ్రామానికి చెందిన షేక్ హఫీజ్ (23) అదే గ్రామానికి చెందిన తలారి భవానీ(హసీనా)ని ప్రేమించి, మూడేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. ఈ పెళ్లికి హఫీజ్ పెద్దలు అంగీకరించలేదు. దీంతో అతడు భార్య హసీనా ఇంట్లోనే నివాసం ఉంటున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులందరూ ఇంట్లోను, ఆరుబయట మంచంపై హఫీజ్ ఒక్కడూ పడుకున్నారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి హఫీజ్ ముఖంపై బలవంతంగా నొక్కి, తల వెనుక వైపు పదునైన ఆయుధంతో దాడి చేసి హతమార్చారు. రక్తమడుగులో ఉన్న భర్త హఫీజ్‌ను చూసి భార్య హసినా కేకలు వేయగా, ఇరుగుపొరుగు వారు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, సీఐ కె.వెంకటేశ్వరరా పరిశీలించారు. హఫీజ్ పనీ పాట లేకుండా స్థానికంగా యువకులతో కలిసి పలు గొడవలకు వెళ్తుండటంతో పాత కక్షల నేపథ్యంలో దుండగులు అతడిని హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. జిల్లా ట్రైనీ ఐపీఎస్ పంకజ్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృత్యు ప్రయాణం

- వేగానికి తోడైన కునికిపాట్లు
- మడికి ప్రమాదంపై పోలీసుల ప్రాథమిక నిర్ధారణ
- ఐదుగురిని బలిగొన్న దుర్ఘటన


వాహనాల వెలుతురులో క్షతగాత్రులకు సేవలందిస్తున్న ఎన్‌హెచ్ అంబులెన్స్ సిబ్బంది (అంతర చిత్రం) రోడ్డు పక్కన చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు

అలమూరు/కంబాలచెరువు (రాజమహేంద్రవరం)/పాలకొల్లు అర్బన్/చోడవరం: రాత్రంతా దాదాపు 200 కిలోమీటర్లు సాగిన ప్రయాణం.. పగటి వేళ వేసవి ఎండలు మండిపోతున్నా.. తెల్లవారుజామున గోదావరి సమీపాన ఉన్న ఆ రహదారిపై చల్లగా వీస్తున్న గాలులు.. సుదీర్ఘ ప్రయాణంతో వచ్చిన అలసట.. తగ్గని వేగం.. దీనికి తోడు కాస్తంత కునికిపాట్లు.. అంతే.. రెప్పపాటులో ఆ ప్రాంతం రక్తసిక్తమైపోయింది. నలుగురి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. మరొకరు ఆసుపత్రిలో మృతి చెందాడు. మరో ఎనిమిది మంది తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అలమూరు మండలం మడికి గ్రామం వద్ద 216ఎ జాతీయ రహదారిపై.. శనివారం వేకువన 3.30 గంటలు దాటిన తరువాత ఈ ఘోర ప్రమాదం జరిగింది. ఐదుగురి ప్రాణాలను బలి తీసుకున్న ఈ ప్రమాదానికి కారు నడుపుతున్న వారి కునికిపాట్లు, మితిమీరిన వేగమే కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

శనైశ్చరుని దర్శనానికి బయలుదేరి..

అనకాపల్లి జిల్లా చోడవరం మండలం ముద్దుర్తి గ్రామానికి చెందిన పతివాడ కన్నయ్యలింగం (51), గంగిరెడ్ల శ్రీనివాసరావు (36), బోడి వెంకునాయుడు (45), పోసూరి నరసింగరావు, తమ్మన శ్రీనివాసరావు, ముచ్చల శ్రీనివాసరావు, కొమరి హేమంత్, బోడి సత్యనారాయణలు టాటా ఏస్ మినీ వ్యాన్‌లో మందపల్లి శనైశ్చర స్వామి దర్శనానికి శుక్రవారం రాత్రి బయలుదేరారు. ఈ వ్యాన్‌ను బోడి వెంకట రమణ అలియాస్ తిరుపతి (55) నడుపుతున్నాడు.


ప్రమాదంలో దెబ్బ తిన్న మినీ వ్యాన్

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం వెంకటాపురానికి చెందిన వేగేశ్న సుబ్రహ్మణ్యంరాజు (45) జిల్లాలో రొయ్యల చెరువులు, పాలకొల్లులో రొయ్యల మేత షాపు నిర్వహిస్తున్నారు. ఒక రొయ్యల కంపెనీ ఆహ్వానం మేరకు పాలకొల్లు పరిసర ప్రాంతాలకు చెందిన 40 మంది పది రోజుల క్రితం వియత్నాం, కాంబోడియా దేశాలకు వెళ్లారు. వీరందరూ శుక్రవారం విశాఖపట్నం చేరుకున్నారు. వెంకటాపురం నుంచి కారు తీసుకు రావాలని తన డ్రైవర్ గొట్టిముక్కల వెంకట్రావును సుబ్రహ్మణ్యంరాజు కోరారు. విశాఖ నుంచి వీరిద్దరితో పాటు పాలకొల్లుకు చెందిన ఆరుమిల్లి రాజేశ్వరరావు, న్యాయవాది మేడపాటి వెంకట రామారెడ్డి కలిసి ఆ కారులో పాలకొల్లుకు ప్రయాణమయ్యారు. అప్పటి వరకూ ఆ కారును డ్రైవర్ వెంకట్రావు నడిపాడు. అతడు నిద్ర పోతున్నట్టు గమనించిన సుబ్రహ్మణ్యంరాజు కారు డ్రైవింగ్ తీసుకున్నారు.


చెట్టును ఢీకొని నుజ్జయిన కారు

మడికి గ్రామం వద్దకు చేరేసరికి వీరి కారు ముందు వెళ్తున్న టాటా ఏస్ మినీ వ్యాన్‌ను వెనుక నుంచి వేగంగా వచ్చి బలంగా ఢీకొంది. అనంతరం ఆ కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. కారు ఢీకొన్న ధాటికి టాటా ఏస్ వాహనం కూడా అదుపు తప్పి, పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న సుబ్రహ్మణ్యంరాజు, మినీ వ్యాన్ డ్రైవర్ తిరుపతి, అందులో ప్రయాణిస్తున్న పతివాడ కన్నయ్యలింగం, గంగిరెడ్ల శ్రీనివాసరావు సంఘటన స్థలంలోనే దుర్మరణం పాలయ్యారు. బోడి వెంకునాయుడు రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందాడు. మృతుల్లో బోడి వెంకట రమణ, వెంకునాయుడు స్వయానా అన్నదమ్ములు.

ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న రాజేశ్వరరావు, వెంకట్రావు, వెంకట రామారెడ్డితో పాటు టాటా ఏస్ వ్యాన్‌లో ప్రయాణిస్తున్న పోసూరి నరసింగరావు, తమ్మన శ్రీనివాసరావు, ముచ్చల శ్రీనివాసరావు, కొమరి హేమంత్, బోడి సత్యనారాయణ తీవ్ర గాయాలపాలయ్యారు. వారికి వాహనాల వెలుగులోనే ప్రథమ చికిత్స అందించి, రాజమహేంద్రవరంలోని వివిధ ఆసుపత్రులకు తరలించారు. వీరిలో రాజేశ్వరరావు, నరసింగరావుల పరిస్థితి విషమంగా ఉందని చెబుతున్నారు. మినీ వ్యాన్ ఢీకొన్న సమయంలో విద్యుత్ స్తంభం విరిగి, తీగలు కింద పడి ఉంటే పరిస్థితి మరింత తీవ్రంగా ఉండేదని స్థానికులు చెప్పారు. ఆలమూరు ఎస్సై శివప్రసాద్ కేసు నమోదు చేయగా సీఐ రజనీకుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా రవాణా అధికారి (డీటీఓ) డి.అశోక్ ప్రతాపరావు చెప్పారు. మడికి ప్రమాద స్థలాన్ని మండపేట మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావుతో కలిసి ఆయన పరిశీలించారు. తెల్లవారుజామున రోడ్డు ప్రమాదాలకు నిద్ర మత్తు కారణమని చెప్పారు. జాతీయ రహదారుల్లో వాహనదారులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. బాటసారులు రోడ్డు దాటేటప్పుడు ఇరువైపులా వాహనాలు వస్తున్నాయో లేదో చూసుకుని వెళ్లాలని సూచించారు.

గోపాలపురంలో టీ'ఢీ'పీ

- నియోజకవర్గంలో తారస్థాయికి వర్గ విభేదాలు
- ముప్పిడి, మద్దిపాటి వర్గాల మధ్య భగ్గుమంటున్న అసంతృప్తులు
- ముప్పిడికి నియోజకవర్గ ఇన్‌చార్జి ఇవ్వాలని పట్టు
- అధిష్టానంతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం
- నాలుగు మండలాల నేతలతో అర్ధరాత్రి వరకూ సమావేశం
- మద్దిపాటి వర్గంపై తిరుగుబాటుకు సమాయత్తం


గోపాలపురంలో శుక్రవారం అర్ధరాతి వరకూ సమావేశమైన ముప్పిడి వర్గీయులు

సాక్షి, రాజమహేంద్రవరం/దేవరపల్లి: టీడీపీ గోపాలపురం నియోజవర్గ నేతల్లో విభేదాలు తారస్థాయికి చేరాయి. మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతూండటంతో ఇరు వర్గాల మధ్య కుమ్ములాటలు మొదలయ్యాయి. పార్టీ వ్యవహారాల్లో ఇద్దరికీ పొసగడం లేదు. ఎవరికి వారే అన్న చందంగా వేరు కుంపట్లు పెట్టారు. మద్దిపాటిని ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించి ముప్పిడి కట్టబెట్టాలన్న డిమాండ్ తెర పైకి వస్తోంది. దీని కోసం ఎంతవరకైనా వెళ్లేందుకు ముప్పిడి వర్గం సిద్ధంగా ఉంది. చివరికి పార్టీ అధినేతతో తాడోపేడో తేల్చుకునేందుకైనా వెనుకాడటం లేదు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి దేవరపల్లి మండలం గౌరీపట్నంలో గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ముప్పిడి వర్గీయులు, కార్యకర్తలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన భేటీ అర్ధరాత్రి 12 గంటల వరకూ కొనసాగింది.

మద్దిపాటి వర్గాన్ని ఎదుర్కోవడం, ముప్పిడికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలనే డిమాండ్‌పై ప్రధానంగా చర్చ జరిగింది. విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. అక్కడ గ్రీన్ సిగ్నల్ రాకపోతే ఎలా వ్యవహరించాలన్న విషయమై భవిష్యత్ కార్యాచరణ రూపొందించినట్టు సమాచారం. గ్రామానికి 50 మంది చొప్పున కార్యకర్తలను ఎంపిక చేసి, ముప్పిడికి మద్దతుగా భారీ స్థాయిలో ఆందోళనలు నిర్వహించాలని, మద్దిపాటి ఒంటెద్దు పోకడను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. వచ్చే ఎన్నికల్లో మద్దిపాటికి ఎమ్మెల్యే టికెట్ ఇస్తే తీవ్ర పరిణామాలు తప్పవని, ఆయనను చిత్తుగా ఓడించేందుకైనా వెనుకాడ రాదని నిర్ణయించినట్టు తెలిసింది. అనంతరం గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి మద్దిపాటికి టికెట్ ఇవ్వవద్దంటూ వివరించాలని తీర్మానం చేశారు. దేవరపల్లి మండల మాజీ అధ్యక్షుడు కొయ్యలమూడి చినబాబు, సుంకర దుర్గారావు, ఏలేటి సత్యనారాయణ (నల్లజర్ల), మేడ్ని సుధాకర్ (గోపాలపురం), సుంకవల్లి బ్రహ్మయ్య (ద్వారకా తిరుమల), పలువురు నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఆది నుంచీ అదే గతి

టీడీపీ అధినేత చంద్రబాబు తీరుతో గోపాలపురం నియోజకవర్గంలోని తెలుగు తమ్ముళ్లు విసిగిపోతున్నారు. ముందు నుంచీ పార్టీ కోసం పని చేస్తున్న ముప్పిడి వెంకటేశ్వరావును నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి నుంచి తొలగించి, ఈ విభేదాలకు చంద్రబాబు ఆజ్యం పోశారు. అప్పటి నుంచీ ఎస్సీ సామాజికవర్గ నేతలు గుర్రుగా ఉన్నారు. పార్టీ ఇన్‌చార్జిగా మద్దిపాటి వెంకట్రాజును నియమించారు. అంతటితో ఆగకుండా వచ్చే ఎన్నికల్లో ఆయనే పోటీ చేస్తారని ప్రకటించారు. దీంతో అగ్గి మరింత రాజుకుంది. తమ నేతను ఎందుకు తప్పించారో స్పష్టం చేయాలని ముప్పిడి వర్గం చంద్రబాబును నిలదీసింది. ముప్పిడి వెంకటేశ్వరావుకు జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు మద్దతుగా నిలిచారు. ఈ పంచాయితీ చంద్రబాబు దృష్టికి వెళ్లింది. పరిస్థితిని చక్కదిద్దాల్సిన ఆయన సైతం మద్దిపాటికి మద్దతు తెలపడంతో నియోజకవర్గంలో రెండు గ్రూపుల మధ్య ఆధిపత్య పోరు నేటికీ కొనసాగుతూనే ఉంది. అప్పుడు మొదలైన ముసలం ఇప్పటికీ సమసిపోవడం లేదు. ముప్పిడి, మద్దిపాటిది తలోదారైంది. పార్టీ కార్యకర్తలు, నాయకులు సైతం రెండు వర్గాలుగా విడిపోయారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం, ఎన్టీఆర్ వర్ధంతి, జయంతి కార్యక్రమాలు సైతం ఎవరికి వారు నిర్వహిస్తున్నారు.

ఫలితమివ్వని బాబు యాత్ర

టీడీపీ ఉనికిని కాపాడుకునేందుకు, వైఎస్సార్ సీపీపై బురద జల్లేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు తూర్పు గోదావరి జిల్లాలో 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ'లో కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా సైతం పార్టీలోని అంతర్గత కుమ్ములాటలు చల్లార్చే ప్రయత్నం చేయలేదు. అప్పట్లో కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల్లో పర్యటించిన చంద్రబాబు.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు గుప్పించడం తప్ప చేసిందేమీ లేదు. కనీసం ఆయన పర్యటించిన నియోజకవర్గాల పరిధిలోనైనా పార్టీ కుమ్ములాటలను చక్కదిద్దిన పాపాన పోలేదు. తమ్ముళ్ల తగవులు తీర్చలేక చేతులెత్తేశారు. కార్యకర్తలు, నాయకులతో రహస్య సమావేశాలు పెట్టుకుని మరీ కలసికట్టుగా ఉండాలని హితబోధ చేసినా నేతల్లో ఎలాంటి మార్పూ లేదు.